ఉపకారం పొందండి..

ప్రతిభే కొలమానం

- నిరుపేద విద్యార్థులకు కేంద్రప్రభుత్వ సహకారం
- ఏటా రూ.12 వేలు.. నాలుగేళ్లపాటు సాయం







శ్రమైక జీవన సౌందర్యానికి నిదర్శనంగా..

- ఆకట్టుకుంటున్న గిరిజన మహిళల ఛాయాచిత్రాలు
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రత్తిపాడు, ఆగస్టు 18: ఆ ఛాయాచిత్రాలు గిరిజన మహిళల జీవన చిత్రాలు.. గిరిజన మహిళల మనుగడుకు సజీవ సాక్ష్యాలు.. కొండకోనల్లో, దట్టమైన అటవీప్రాంతాల్లో గిరిపుత్రికల శ్రమైక జీవన విధానానికి అద్దంపట్టే దృశ్యాలు. ప్రత్తిపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ సలాది కృష్ణ ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన మహిళలు, యువతులపై తీసిన ఈ ఛాయాచిత్రాలు వారి జీవన విధానానికి అద్దం పడుతున్నాయి. ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఎంతో ఆసక్తి, ముచ్చట గొలుపుతున్న ఈ చిత్రాలు పలువురిని మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

నేడు రాఖీ పౌర్ణమి

- పిఠాపురం దత్త ఆలయాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- శ్రీపాదశ్రీవల్లభుడిని సోదరుడిగా భావించే మహారాష్ట్ర, ఉత్తరాధి భక్తులు
- శ్రీపాదునికి రాఖీ కట్టేందుకు ఇప్పటికే పిఠాపురం చేరిక
- లాడ్జీలు, హోటళ్లు, అతిథిగృహాలు, ఆలయాల రూమ్‌లు హౌస్‌ఫుల్



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభునికి రాఖీలు కడుతున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

పిఠాపురం, ఆగస్టు 18: శ్రావణ(రాఖీ) పౌర్ణమికి ముందుగానే భక్తజనం తరలివచ్చారు. హోటళ్లు, లాడ్జీలు, ప్రైవేటు అతిథిగృహాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రహదారులపై ఎక్కడ చూసినా మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులే కనిపిస్తున్నారు. శ్రీపాదశ్రీవల్లభులకు కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శ్రావణిపౌర్ణమి రోజున రాఖీ కట్టిన పవిత్రదినం కావడంతో ఈ రోజుకు విశేష ప్రాధాన్యం ఉంది. రాఖీ(శ్రావణ లేదా జంధ్యాల) పౌర్ణమికి పిఠాపురం పట్టణంలోని దత్త క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్నాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఒడిస్సా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు దత్తక్షేత్రాలకు తరలివచ్చి పూజలు నిర్వహించడంతోపాటు తాము సోదరుడిగా భావించే శ్రీపాదశ్రీవల్లభులకు రాఖీలు కడతారు. రెండురోజులు ముందుగానే మహారాష్ట్రతోపాటు ఉత్తరాది రాష్ట్రాలనుంచి భక్తులు తరలిరావడంతో పట్టణ రహదారుల్లో ఎక్కడ చూసినా వీరే కనిపిస్తున్నారు. రాఖీ రోజున సాధారణంగా మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు పొందుతారు. అందుకు భిన్నంగా మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల భక్తులు మాత్రం శ్రీపాదశ్రీవల్లభులు, ఈ క్షేత్రాల్లో ఉన్న ఔదంబర వృక్షానికి రాఖీలు కడతారు. శ్రావణి పౌర్ణమి రోజున రాఖీలు కట్టడం ద్వారా శ్రీపాదుని ఆశీస్సులు లభిస్తాయని భక్తుల నమ్మకం. ప్రత్యేకంగా రాఖీలు కట్టడం కోసమే ఆ ప్రాంతాల భక్తులు తరలివస్తారు. భక్తులు భారీసంఖ్యలో ముందుగానే తరలిరావడంతో పట్టణంలోని ఆలయాల్లోని రూమ్‌లతోపాటు లాడ్జీలు, హోటళ్లు, ప్రైవేటు అతిథిగృహాలు, కల్యాణమండపాల్లోని గదులన్నీ నిండిపోయాయి. గదులు దొరకని వారు పలుచోట్ల కల్యాణ మండపాలను అద్దెకు తీసుకుని అక్కడ బస చేస్తున్నారు.

శ్రీపాదవల్లభ సంస్థానంలో...



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో ఔదంబర వృక్షానికి రాఖీ కడుతున్న మహిళ

శ్రీపాదశ్రీవల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాదవల్లభ సంస్థానంలోని శ్రీపాదశ్రీవల్లభులకు సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. పల్లకి సేవ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. దీంతో రాఖీ పౌర్ణమిలో పాల్గొనేందుకు మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన భక్తులు రెండు రోజులు ముందుగానే సంస్థానానికి చేరుతున్నారు. ఇక్కడి పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొంటున్నారు. సోమవారం ఉదయం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీపాదశ్రీవల్లభులకు, ఔదంబర వృక్షానికి భక్తులు రాఖీలు కడతారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఈవో సౌజన్య తదితరులు పరిశీలించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

పాదగయ క్షేత్రంలో..

పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూగా వెలసిన దత్తాత్రేయస్వామికి, ఆవరణలో ఉన్న అలక్‌నిరంజన్ దత్తబృందావనంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం పల్లకిసేవ, పుష్పార్చనలు జరుగుతాయి. ఇక్కడ స్వయంభూ దత్తుని చెంతనే ఉన్న శ్రీపాదశ్రీవల్లభుడికి మహిళా భక్తులు రాఖీలు కడతారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవానీ తెలిపారు. పిఠాపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న గోపాల్‌బాబా ఆశ్రమంలో గురువారం రాఖీపౌర్ణమి సందర్భంగా పలు కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం శ్రీపాదస్వామికి, గోపాల్‌బాబాకు పంచామృతాభిషేకం, రాఖీధారణ, సాయంత్రం విశిష్ట పల్లకిసేవ నిర్వహిస్తారు. కాగా అగ్రహారంలోని అనఘాదత్తక్షేత్రం, సాయిబాబా ఆలయాల్లోనూ రాఖీ పౌర్ణమి పూజలు జరుగుతాయి. ఇందు నిమిత్తం ఆయా ఆలయ కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేశాయి.

బదిలీల జాతర

- నేటినుంచి వివిధ శాఖల్లో బదిలీల సందడి
- సిఫార్సుల కోసం ఎమ్మెల్యేల వద్ద క్యూ కడుతున్న ఉద్యోగులు
- తాజాగా పచ్చ జెండా ఊపిన ప్రభుత్వం
- ఐదేళ్లు దాటితే ఉన్న చోటు నుంచి కదలాల్సిందే
- 15శాఖలకే బదిలీల్లో చోటు
- 19 నుంచి 31 లోపే ఈ ప్రక్రియ ముగింపు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన బదిలీలు



కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 18: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల సందడి సోమవారం నుంచి ప్రారంభం కాబోతుంది. ప్రజా సంబంధమైన శాఖలకు మాత్రమే ఈసారి బదిలీలు వర్తింపజేశారు. ఉపాధ్యాయులు, వైద్యవిభాగాల్లో పనిచేస్తున్న వారిని ఈ ప్రక్రియ నుంచి ఈసారి మినహాయించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని కూడా ఈసారి పెద్దఎత్తున స్థాన చలనం కలిగించబోతున్నారు. పాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికనే ఈసారి కూడా బదిలీలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈప్రక్రియ ఈనెల 19 నుంచి ఆరంభమై 31 నాటితో ముగియనుంది. తదుపరి వెంటనే బదిలీలపై తిరిగి నిషేధం అమలులోకి రానుంది.

అత్యధికులకు స్థానచలనం


ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలను శనివారం ప్రభుత్వం విడుదల చేసింది. పెద్దఎత్తున బదిలీలకు అవకాశం ఉంది. ఎవరైతే ఐదేళ్లపాటు ఒకే ప్రాంతంలో ఇప్పటివరకు కొనసాగి ఉంటారో వారందరినీ విధిగా బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వం పాలనా వ్యవహారాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించింది. జిల్లాలను నేరుగా విభజించింది. ఉమ్మడి జిల్లాలు చెదిరిపోయాయి. జగన్ పాలనలో ఏర్పడిన గ్రామ సచివాలయాల్లోను పెద్దఎత్తున సిబ్బందిని నియమించారు. ఇప్పుడు వీరంతా దాదాపు ఐదేళ్లపాటు పదవీకాలం పూర్తి చేసుకున్నట్లయింది. వీరిలో అత్యధికులను ఎక్కడికక్కడ స్థాన చలనం చేయబోతున్నారు.

ఏఏ శాఖల్లో బదిలీలు.?

సాధారణంగా ప్రభుత్వపరంగా ఉద్యోగులందరినీ బదిలీ చేయకుండా కేవలం ప్రజాసంబంధ వ్యవహారాల్లో నిత్యం మునిగితేలే శాఖలనే బదిలీలకు కూటమి ప్రభుత్వం ఎంచుకుంది. ప్రత్యేకించి పోలీస్, రెవెన్యూ, కమర్షియల్ ట్యాక్స్, పంచాయతీరాజ్, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో కలిపి దాదాపు 15 శాఖల్లో మాత్రమే బదిలీలు చేయాలని నిర్ణయించారు. ఆయాశాఖల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులను ఇప్పటికే బదిలీ చేసి చాలా కాలమైంది. కొందరైతే తమకు నచ్చిన స్థానాల్లో ఏళ్ల తరబడి ఒకే స్థానంలో పనిచేస్తూ వస్తూ ఎక్కడికక్కడ అవినీతికి పాల్పడ్డారు. ఇంకొందరు తమకు నచ్చిన పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లోను కదలిక

గత ప్రభుత్వ మానస పుత్రికగా గ్రామ, వార్డు సచివాలయాలు ప్రత్యక్షమయ్యాయి. ఆ క్రమంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సచివాలయాల్లో 13వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో సగానికి సగం మందిని ఈసారి స్థానచలనం చేసే అవకాశముంది. ఈ శాఖల్లో పనిచేస్తూనే ఇంకోవైపు అప్పట్లో అధికార వైసీపీకి బాజా మోగించారు. ప్రభుత్వం అంటే మేమేనంటూ అలజడి చేశారు. ఇలాంటి వారందరినీ గడిచిన కొన్నినెలల క్రితం శాశ్వత ఉద్యోగులుగా నియమించారు. ఇప్పుడు వీరిలో అత్యధికులను బదిలీ చేయనుండడం కొత్త విశేషం.



పంచాయతీ సెక్రటరీలకు...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1012 పంచాయతీ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఐదేళ్లు నిండిన పంచాయతీ కార్యదర్శులు 300 మంది వరకు బదిలీ కానున్నారు.

ఎమ్మెల్యేలకు ఒక అవకాశం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటిన తర్వాత తొలిసారిగా ఉద్యోగుల బదిలీలకు అనుకూలంగా ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నేపథ్యంలో కొత్త ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తారాస్థాయిలో జరగాలని ఆకాంక్షిస్తున్నారు. ఇప్పటికే వైసీపీకి అంటకాగిన అధికారులు, సిబ్బంది అనేకమంది తమ కళ్లెదుటే ఉండడం వీరికి మింగుడు పడడంలేదు. నియోజకవర్గాల్లో తమకంటూ కొత్త టీమ్‌లను ఏర్పాటు చేసుకోవడానికి ఈ బదిలీ ప్రక్రియ కొత్త ఎమ్మెల్యేలకు వరంగా మారింది. సాధ్యమైనంత మేర ఇంజనీరింగ్ విభాగాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, పోలీస్ విభాగాలన్నింటిలోను అత్యధికులు రాజకీయ సిఫార్సులు కోరుకునే వారే.

జలకాలాటలలో..



ఉప్పాడ రేవులో సముద్రంలో చల్లదనాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులు

కొత్తపల్లి, ఆగస్టు 18: ఆదివారం వాతావరణం గుబులు రేపింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడి వాతావరణం నెలకొంది. దీంతో తీరప్రాంత పరిసరాల ప్రజలు చిన్నా,పెద్దా అంతా కలిసి ఉప్పాడ రేవుకు చేరుకున్నారు. ఇక్కడి సముద్రంలో జలకాలాటలు ఆడారు. ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల్లో పర్యాటకులు గుంపులుగా వెళ్లి స్నానాలు చేస్తూ చల్లదనాన్ని ఆస్వాదించారు. తీరంలో పర్యాటకులు సముద్రంలోపలకు వెళ్లకుండా కొత్తపల్లి, తిమ్మాపురం పోలీసులు చర్యలు చేపట్టారు.

రేపటి నుంచి ఇంటింటి ఓటర్ సర్వే

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు



సామర్లకోట, ఆగస్టు 18: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర కార్యాలయంనుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, అక్కడి నుంచి ఆర్డీవోలకు, తహశీల్దార్ కార్యాలయాలకు ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు అందాయి. ఈ మేరకు రెవెన్యూ అధికారులనుంచి అందిన సమాచారం మేరకు ఆగస్టు 20 మంగళవారం నుంచి అక్టోబరు 18 వరకూ బీఎల్వోలు ఇంటింటి సర్వే ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. అక్టోబరు 19 నుంచి 28 వరకూ అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలి. డిసెంబరు 24 లోగా అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అనంతరం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. డిసెంబరు 24లోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన పరిష్కార కార్యక్రమం చేపట్టాలి. 2025 జనవరి 1లోగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జాబితా రూపొందించి సిద్ధం చేసుకోవాల్సి ఉంది. ఈ ఏడాది నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉంది.

నేటి నుంచి పవన్ నివాసం వద్ద జనవాణి

సోమవారం నుంచి శనివారం వరకూ వినతుల స్వీకరణ




చేబ్రోలులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద జనవాణి కార్యక్రమం నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 18: గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంవద్ద జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సోమవారంనుంచి శనివారం వరకూ ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ప్రజలు నుంచి వినతులు స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంనుంచే గాక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి పవన్‌ను కలిసి వినతులు అందించేందుకు ప్రజలు తరలివస్తున్న నేపథ్యంలో పవన్ తరఫున వినతులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన ముఖ్యనేతలు దగ్గరుండి పర్యవేక్షిస్తారు. వచ్చిన వినతులకు సంబంధిత అధికారులకు పంపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.

వాతావరణ సమాచారం

నేరుగా గ్రామానికే

- రోజూవారీ అందించే ఏర్పాటు
- రైతులందరికీ ఉపయోగం
- రాష్ట్రమంతటా అమలుకు సన్నాహాలు



సామర్లకోట, ఆగస్టు 18: ఇకపై గ్రామ పంచాయతీ స్థాయిలో రోజూవారీ వాతావరణ సమాచారం, సూచనలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలోనే భారత వాతావరణ విభాగం పంచాయత్ మౌసం సేవా పోర్టల్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా బ్లాక్(సమితి) స్థాయిలో వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అందిస్తోంది. దీన్ని విస్తరించాలని తాజాగా నిర్ణయించింది. కిసాన్ సంచార్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి కేంద్రం ఈ ఏర్పాట్లను ప్రారంభించింది. 6 లక్షల గ్రామాల్లో రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇది అమలులోకి వస్తే గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణ సమాచారం రైతులకు అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల రైతులు పంటల సాగు విషయంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. ఇప్పటివరకూ మన రాష్ట్రానికి సంబంధించిన వరకూ మండల స్థాయికే ఈ సేవలు పరిమితమయ్యాయి. గ్రామస్థాయికి అందుబాటులోకి రానందున రైతులకు పంటల సాగు విషయంలో కొంతమేర అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎప్పుడు ఏ పంట సాగు చేస్తే చీడపీడలను అధిగమించి అధిక దిగుబడులు పొందవచ్చో తెలియని సందిగ్ధత ఉంటోంది. మండలస్థాయి లో వ్యవసాయశాఖ అధి కారులు సిబ్బంది నుంచి సరైన సమాచారం అందడంలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వ్యవసాయ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

వర్షపాతం నమోదు విషయంలో ఇప్పటికే అశాస్త్రీయ విధానమే అమల్లో ఉందని, దీన్ని మార్చాలన్న అభిప్రాయం రైతుల నుంచి వ్యక్తమవుతోంది. మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల్లో రెయిన్‌ఫాల్ నమోదు మీటర్లు ఏర్పాటు చేసిన అధికారులు ఇక్కడ కురిసిన వర్షాన్నే మండల వ్యాప్తంగా కురిసినట్లు పరిగణించి నివేదికలు పంపుతున్నారు. దీనివల్ల రైతులకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కరువు మండలాల గుర్తింపు సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గ్రామస్థాయిలో వర్షపాతం నమోదుకు ఎన్నో ఏళ్లుగా కసరత్తు చేస్తున్నా అమలులోకి రాలేదు. ఇకపై ఈ సమస్యకు పరిష్కారం లభించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రైతులకు ఎంతో ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ప్రయోజనం కలుగుతుంది. వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయిలో అందడంవల్ల పంటల సాగు విషయంలో రైతులు సరైన నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుంది. నష్టాలు వాటిల్లితే మండలం యూనిట్‌గా తీసుకునేవారు. దీనివల్ల చాలామంది రైతులు నష్టపోయేవారు. ఇకపై ఈ పరిస్థితి నుంచి బయటపడే అవకాశం ఉంది.

బండారు వెంకట సత్యనారాయణ, రైతు, పెదబ్రహ్మదేవం, సామర్లకోట



ఉపాధి రోడ్డులో నిధులు మింగేసిన ఇంజనీర్లు

- అడ్డతీగల మండలంలో న్యాయమూర్తుల పర్యటనలో వెలుగుచూసిన బాగోతం
- మెటల్ రోడ్డు పేరుతో అడ్డంగా దోపిడీ
- రూ.90 లక్షలతో చేపట్టిన మెటల్ రోడ్డు నిర్మాణమంతా డొల్ల
- ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఒక్కటై నిధుల స్వాహా?



నాణ్యత లోపించిన దుశ్చర్తి-పోలవరప్పాడు రోడ్డు పనులు.. ఉపాధి హామీ పని కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం

రంపచోడవరం, ఆగస్టు 18: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉపాధి పనుల్లో ఇంజనీర్లు, గుత్తేదార్లు కుమ్మక్కై నిధులు మింగేసిన వైనమిది. అడ్డతీగల మండలంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో 2.5 కిలోమీటర్ల మేర దుశ్చర్తి-డి.పోలవరప్పాడు మెటల్ రోడ్డు నిర్మాణాన్ని 2023 ఆగస్టులో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టారు. ఈ రహదారుల్లోని నాణ్యతా లోపాలు ఇటీవల కురిసిన వర్షాలతో బయటపడ్డాయి. ఇటీవల జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశబాబు, అడ్డతీగల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.బాబు న్యాయవాదులతో కలిసి అడ్డతీగల జ్యూడీషియల్ మేజిస్ట్రేటు కోర్టు పరిధిలో రహదారులులేని గ్రామాలను పరిశీలించారు. అడ్డతీగల మండలంలోని దుశ్చర్తి పరిధిలోని డి.చోడవరం, పోలవరప్పాడు గ్రామాల సందర్శన చేసిన సందర్భంలో ఈ దుశ్చర్తి-పోలవరప్పాడు రోడ్డు అధ్వానస్థితి వారి దృష్టికి వచ్చింది. ఈ మెటల్ రోడ్డు నిర్మాణం జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టగా, ఇందులో ఈ రోడ్డు పరిసర గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పించడమేకాకుండా, ఇందులో మెటీరియల్ కోసం కూడా నిధులను కేటాయించారు. నిర్మాణంలో అనుసరించాల్సిన నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, నాణ్యమైన మెటీరియల్‌ను వినియోగించకపోవడం, సరైన రోలింగ్ చేయకపోవడం వంటి అనేక కారణాలు ఈ రోడ్డును అధ్వానస్థితికి తీసుకువచ్చాయి. ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో మెటల్‌ను వినియోగించిన దాఖలాలే కానరావడంలేదు. మొక్కుబడిగా మెటల్‌ను జల్లి, పరిసరాల్లో అందుబాటులో ఉన్న మట్టిని వినియోగించి నిర్మాణాన్ని కానిచ్చేశారు. నిశితంగా గమనిస్తే ఈ రోడ్డు నిర్మాణం మూలంగా ఆయా గ్రామాల ప్రజలకు ఉపాధి కలగడం, ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కలగడం అనే లక్ష్యానికంటే కేవలం ఇంజనీర్లు-గుత్తేదార్లకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఈ పని సాగింది. ఒక్క పనిని చూస్తేనే ఇలా ఉంటే మండలంలోనేకాకుండా ఏకంగా రంపచోడవరం ఐటీడీఏ మొత్తం పరిధిలో వందల కోట్ల రూపాయలను గుమ్మరించి ఇటువంటి పనులు ఎన్ని చేపట్టారో చూస్తే చాలావరకూ అన్ని పనుల్లోనూ ఇదే తరహా అక్రమాలు, నాణ్యతా లోపాలు చోటు చేసుకున్నాయని తెలుస్తోంది. పనులన్నిటిపైనా సమగ్ర విచారణ జరిపితే బాగోతాలన్నీ బట్టబయలవుతాయని తెలుస్తోంది.

ఉపకారం పొందండి.. ప్రతిభే కొలమానం

- నిరుపేద విద్యార్థులకు కేంద్రప్రభుత్వ సహకారం
- ఏటా రూ.12 వేలు.. నాలుగేళ్లపాటు సాయం

తుని రూరల్, ఆగస్టు 18: ప్రతిభ కనబరిచే పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. 8వ తరగతి చదివే పిల్లలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) అందించి వారిని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 2024-25 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 6 వరకు గడువుగా నిర్ణయించింది. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగేళ్లపాటు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. గత ఏడాది జిల్లాలో 2 వేలమందికి పైబడి ఉపకారవేతనాలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది మరింత మంది ఉపకార వేతనాలు అందుకునే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించి శిక్షణ ఇస్తున్నారు.

అర్హతలు ఇవీ..

ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, ఉన్నత, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులకు 7వ తరగతిలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులకు 50శాతం మార్కులు రావాలి. కుల ఆదాయ ధ్రువపత్రాలతోపాటు 7వ తరగతి ఉత్తీర్ణత పత్రాలు ఉండాలి.

ఇదీ పరీక్ష విధానం

డిసెంబరు 8న ఉదయం 10 నుంచి 1గంట వరకు 180 మార్కులకు పరీక్ష ఉంటుంది. దీంతో మెంటల్ ఎబిలిటీ 90 మార్కులు, స్టాటిస్టిక్ ఎబిలిటీ 90 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. 7,8 తరగతులకు చెందిన గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుంది. ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ www.esv.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. దరఖాస్తులకు సంబంధించి విద్యార్థుల పూర్తి వివరాలను ప్రధానోపాధ్యాయుల సమక్షంలో నమోదు చేసుకుని ఎస్సీఎస్టీ దివ్యాంగ విద్యార్థులు రూ.50, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100 ఆన్‌లైన్ ద్వారా పరీక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

అన్నవరం దేవస్థానంలో.. గుర్తుతెలియని వ్యక్తి మృతి

అన్నవరం, ఆగస్టు 18: అన్నవరం దేవస్థానంలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అన్నవరం ఎస్ఐ కిషోర్ తెలిపారు. అతడు దైవదర్శనానికి వచ్చిన వ్యక్తి కాదని, 2, 3 రోజులుగా అన్నవరం కొండకు విచ్చేసిన భక్తులను యాచిస్తున్నట్లు గమనించినట్లు ప్రైవేటు సెక్యూరిటీ వారు తెలిపారు. మృతదేహాన్ని హుటాహుటిన కిందకు తరలించి అన్నవరం కొండపై పండితులు సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టారు.



రత్నగిరి పార్కింగ్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ప్రకృతి సోయగాలు.. పూల రాఖీలు









- కడియం నర్సరీల్లో రాఖీపుష్పాల కనువిందు

కడియం, ఆగస్టు 18: దేశవ్యాప్తంగా పేరు గాంచిన కడియం నర్సరీల్లో ప్రకృతి సోయగాల పూల రాఖీలు కనువిందు చేస్తున్నాయి. సోదరప్రేమను ప్రదర్శించే ఆత్మీయ శుభతరుణం రక్షాబంధన్ (రాఖీ పండుగ). ఈ పండుగ రోజు రక్షాబంధనాలు కట్టుకుని సోదరులు విలువైన కానుకలు ఇచ్చి సోదరీమణులపట్ల ఆత్మీయతను చూపిస్తారు. ఇటీవల పుట్టినరోజు, వివాహ వేడుకలకు బహుమతులు బదులు మొక్కలు ఇచ్చి పుచ్చుకునే సంప్రదాయం నడుస్తోంది. అచ్చంగా రాఖీల్లా గే కనిపించే పూలమొక్కలు రక్షాబంధన్ వేళ కానుకలు అవుతున్నాయి. ప్యాసీఫ్లోరా శాస్త్రీయ నామంతో పిలిచే ఈ రాఖీపుష్పాలు విభిన్న పరిమళాల్లో, వివిధ ఆకృతులు, ఎరుపు, నీలం, తెలుపు తదితర విభిన్న రంగుల్లో విరబూస్తూ నర్సరీల్లో కనువిందు చేస్తున్నాయి. చక్కని పరిమాణంలో పువ్వు, దాని చుట్టూ సన్నని రేకులు ఉంటూ అందంగా కనిపించే ఈ రాఖీపుష్పాన్ని కౌరవులు-పాండవులు పుష్పమని కూడా పిలుస్తుంటారు.

బెహ్రాయిన్‌లో మామిడికుదురు యువకుడి ఆత్మహత్య

- ఉపాధి నిమిత్తం నెల క్రితమే విదేశానికి వెళ్లాడంటున్న కుటుంబసభ్యులు
- మృతిపై విచారణ జరపాలని డిమాండ్
- మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని వేడుకోలు



దుర్గానాగసాయి(ఫైల్)

మామిడికుదురు, ఆగస్టు 18: నెల రోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం బెహ్రెయిన్ వెళ్లిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అసలు అక్కడ ఏం జరిగిందో కుటుంబీకులకు తెలియదు. కానీ ఉరి వేసుకుని చనిపోయాడనే సమాచారం రావడంతో వారు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నంలంక గ్రామానికి చెందిన దుర్గానాగసాయి ఈనెల 22న ఇంటినుంచి బయలుదేరి 29వతేదీ నాటికి బెహ్రెయిన్ చేరుకున్నాడని అతడి మేనమామ ఉండపల్లి రమేష్ అలియాస్ శ్రీను ఆదివారం తెలిపాడు. అక్కడ పెట్రోలు బంకులో పనిచేస్తూ తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడని, ఏవిధమైన సమస్యలు ఉన్నట్టు తనతో చెప్పలేదని పేర్కొన్నాడు. చనిపోయే ముందు రెండు రోజులక్రితం కూడా ఫోన్‌లో మాట్లాడాడన్నారు. అతడితోపాటు కేరళకు చెందిన యువకుడు ఒకే గదిలో ఉంటున్నారని, తన మేనల్లుడి మృతిపై విచారణ జరిపించాలని, మృతదేహాన్ని స్వదేశం రప్పించేందుకు సహకరించాలని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌తోపాటు పిగన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కోరానని తెలిపాడు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

సామర్లకోట, ఆగస్టు 18: సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి సామర్లకోట-పిఠాపురం రైల్వే ట్రాక్ మధ్య 60ఏళ్ల వయస్సు గల వృద్ధుడు వేగంగా వెళుతున్న రైలు కింద పడి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సామర్లకోట రైల్వేపోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు. ఖొరక్‌పూర్-అసన్‌సోల్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు లోకోపైలట్ సామర్లకోట రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ జీకేఎస్ శ్రీదేవికి అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. మృతదేహానికి తెల్లటి చొక్కాపైన నల్లటి చుక్కలు, నీలం రంగుపై నలుపు గీతల లుంగీ, నీలం రంగుపై తెలుపు గీతలు గల టవల్, తెలుపు రంగు చెప్పులు, కుడితొడపై పుట్టుమచ్చలు కలిగి ఉన్నాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు.

మత్స్యకారుల వలకు చిక్కిన భారీ చేప

- అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో లభ్యమైన టేకి చేప



అంతర్వేది పల్లిపాలెం మినీఫిషింగ్ హార్బరులో బోటునుంచి ఎక్స్‌కవేటర్ సాయంతో తెస్తున్న టేకి చేప

అంతర్వేది, ఆగస్టు 18: అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల వలకు భారీ టేకి చేప చిక్కింది. దీన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో బోటునుంచి వెలికి తీశారు. పశ్చిమగోదావరి జిల్లా వేములదీవికి చెందిన బలగం వెంకటేశ్వర్లు చేపల బోటుపై కాకినాడ మత్స్యకారులకు ఈ టేకి చేప వలకు చిక్కింది. అంతర్వేది సముద్రంలో చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులకు దొరికిన ఈ భారీ చేపను అతికష్టంపై బోటుసాయంతో హార్బరు వద్దకు తీసుకువచ్చారు. 30మంది జాలర్లు తాళ్లతో పైకి లాగినా రాకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో హార్బర్ ప్లాట్‌ఫామ్‌కు తీసుకువచ్చారు. అంతర్వేదిలో తక్కువ ధర పలకడంతో కాకినాడ కుంభాభిషేకం రేవుకు వ్యానుపై తీసుకువెళ్తామని మత్స్యకారులు తెలిపారు. వెయ్యి కిలోల పైబడి ఉండే ఈ భారీ టేకిచేపలు అరుదుగా వస్తాయని, వీటిని ముక్కలు కోసి ఉప్పు చేపగా అమ్ముతారని తెలిపారు.



అయినవిల్లి విఘ్నేశ్వరుడికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఆగస్టు 18: ముమ్మిడివరానికి చెందిన ముళ్లపూడి గణేష్ కుటుంబసభ్యులు ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద్ ట్రస్టుకు రూ.లక్ష విరాళం అందించారు. అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

లోవలో భక్తుల కోలాహలం

- కిక్కిరిసిన క్యూలైన్‌లు
- ఆలయానికి రూ.3.76లక్షల ఆదాయం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, ఆగస్టు 18: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలలనుంచి వేలాదిగా వచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువ జామున ఆలయ పండితులు ప్రత్యేక పూజల తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించడంతో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులు వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో కె.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు చేశారు. అమ్మవారిని 20వేలమంది పైబడి భక్తులు దర్శించుకోగా దేవస్థానంలో వివిధ విభాగాల ద్వారా రూ.3.76లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

లారీలో గంజాయి రవాణా

- హైవేపై తనిఖీల్లో భాగంగా రాజానగరంలో పట్టుకున్న పోలీసులు
- 100 కిలోలు గంజాయి, ఒక లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, ఆగస్టు 18: విశాఖ ఏజెన్సీ నుంచి తమిళనాడుకు గుట్టు చప్పుడు కాకుండా లారీలో తరలిస్తున్న రూ.5లక్షల విలువైన 100 కిలోల గంజాయిని రాజానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ కలిసి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రంలోని సేలం జిల్లా వజపడి మండలం వెప్పిలైపట్టిపుదురు గ్రామానికి చెందిన మరిముత్తు ఆరుముగమ్, పెరంబుదూరు జిల్లా సిరుమతూర్ మండలం కుదిక్కడు గ్రామానికి చెందిన వేల్ మురుగన్ కలిసి విశాఖ ఏజెన్సీనుంచి తమిళనాడుకు 100 కిలోల గంజాయిని బస్తాలతో లారీలో తరలిస్తున్నారు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ మనోహర్ తమ సిబ్బందితో కలిసి ఆదివారం జాతీయ రహదారిపై రాజానగరం ఫైస్కూల్ జంక్షన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా వీరు గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. విశాఖ ఏజెన్సీలో గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలోని సేలం నగరానికి తీసుకెళ్లి ఎక్కువ ధరకు అమ్ముకునేలా వ్యాపారం నిమిత్తం రవాణా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. వీరిలో వేల్ మురుగన్‌పై తిరుచ్చి పోలీస్‌స్టేషన్‌లో గతంలో గంజాయి కేసు నమోదైనట్టు డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు. నిందితులతోపాటు రూ.5లక్షల విలువైన గంజాయి, లారీ, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

ఏడాదిలో రూ.25లక్షల విలువైన గంజాయి స్వాధీనం

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాదికాలంగా ఏడు గంజాయి కేసులు నమోదు కాగా రూ.25 లక్షలు విలువైన 506.35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 22మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ వివరించారు. ఈ కేసులకు సంబంధించి రెండు లారీలు, ఒక వ్యాన్, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి తాగడం, రవాణా, వ్యాపార కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ మనోహర్, హెచ్‌సీ నాగేంద్ర, వీఆర్వో అప్పారావు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి

- గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు



ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో సత్తి సూర్యనారాయణరెడ్డి, గౌతమ్‌రెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 18: ప్రజలు కిడ్నీ వ్యాధులపై ముందస్తు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి, పలువురు వైద్యప్రముఖులు ఆస్పత్రిలోని ఐసీయూ, లేబోరేటరీ, ఇన్ పేషెంట్, ఆపరేషన్ థియేటర్ తదితర విభాగాలను ప్రారంభించారు. డాక్టర్ గౌతమ్ రెడ్డి, సత్తి సూర్యనారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జీవనశైలి మార్చుకోవడం ద్వారా కిడ్నీ, యూరాలజీ సంబంధిత వ్యాధులను నివారించవచ్చన్నారు. రాజమహేంద్రవరంలో అత్యున్నత ప్రమాణాలతో రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య సంస్థల చైర్మన్ గన్ని భాస్కరరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డాక్టర్ వీర్రాజు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి వెండి ఆభరణాల బహూకరణ



మామిడికుదురు, ఆగస్టు18: మామిడికుదురు మండలం మొగలికుదురులో శ్రీరుక్మిణిసత్యభామ సమేతవేణుగోపాలస్వామికి గ్రామానికి చెందిన దండు భీమరాజు-విజయలక్ష్మి దంపతులు రూ.1.50లక్షల విలువైన వెండితో చేసిన వక్షస్థలం, శంఖు, చక్రాలను బహూకరించారు. ఆలయఅర్చకులు వెండి ఆభరణాలను సంప్రోక్షణ చేసి స్వామికి అలంకరించారు.

పొలంలో గుళికలు చల్లుతుండగా అస్వస్థత

- 8మంది కూలీలు ఆస్పత్రికి తరలింపు
- బిక్కవోలు మండలం పందలపాకలో ఘటన
- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి పరామర్శ



కూలీలను 108 అంబులెన్స్‌లో అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

అనపర్తి, ఆగస్టు 18: బిక్కవోలు మండలం పందలపాకలో వరిపొలంలో గుళికలు చల్లుతూ 8మంది వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌ల సహాయంతో అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యసిబ్బంది తెలిపారు.

బాధితులు, స్థానికుల వివరాల ప్రకారం.. బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన రైతు శ్రీధర్ నారాయణరెడ్డి తన 15 ఎకరాల వరి పొలంలో గుళికలు చల్లేందుకు పందలపాక, ఊలపల్లి, మాచవరం గ్రామాలకు చెందిన 9మంది కూలీలను నియమించుకున్నారు. వీరు 9ఎకరాల్లో గుళికలు చల్లి కొంతసేపు సేదతీరారు. అంతలో మరో కూలీ తెచ్చిన మజ్జిగను తాగి తిరిగి పనికి ఉపక్రమించారు. కొద్దిసేపటికే పందలపాకకు చెందిన టి.విజయ్‌కుమార్, సీహెచ్ దుర్గారావు, పి.రాంబాబు, వై.వినోద్‌కుమార్, మాచవరం గ్రామానికి చెందిన విజ్జన శ్రీను, పలివెల యాకోబు, తాతపూడి గోవిందు, ఊపల్లికి చెందిన ఆర్.వెంకటరమణలకు కళ్లు తిరుగుతూ ఊపిరి తీసుకోవడం కష్టమైంది. దీంతో యజమాని 108కి సమాచారం అందించాడు. దీంతో అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించి అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు సేవలు ప్రారంభించడంతో ప్రాణాపాయంనుంచి బయటపడ్డారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం వీరంతా కోలుకుంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, నూతిక బాబూరావు తదితరులున్నారు.

వైభవంగా పరదేశమ్మ తీర్థం

తాళ్లరేవు, ఆగస్టు 18: తాళ్లరేవు గ్రామదేవత పరదేశమ్మ తీర్థం వైభవంగా ఆదివారం జరిగింది. భక్తులు కొత్తమ్మవారిని జెల్లావరిపేట నుంచి పరదేశమ్మపేట వరకు బాణసంచా, తీన్‌మార్ డప్పులతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తులు పరదేశమ్మ, కొత్తమ్మవార్లకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తీర్థంలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

నేడు పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, ఆగస్టు 18: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం పట్టణంలోని రథాలపేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నారు. కలెక్టరు సగిలి షాన్‌మోహన్, జిల్లాస్థాయి దిగువ అధికారులు, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులందరూ హాజరవుతారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులను వచ్చి విన్నవించుకోవచ్చని కలెక్టరు వివరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ ఈ వేదిక జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అధికారులంతా ఉదయం 9.30గంటలకు కార్యక్రమం వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చే ప్రజలకు సహాయపడేందుకు గానూ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనరు కనకారావు తెలిపారు. కాగా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. కలెక్టరేట్ గ్రీవెన్స్‌హాలులో ఈ కార్యక్రమంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ జరుగుతుందని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 18: ప్రభుత్వాదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని 08842357800లో సమస్యలు చెప్పవచ్చన్నారు.

నేడు వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 18: కాకినాడలోని వికాస కార్యాలయంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని చెప్పారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్, ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాల ఆధారంగా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని వికాస కార్యాయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7799376111లో సంప్రదించాలన్నారు.

నేడు సీఎంను కలవనున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 18: గత ప్రభుత్వ హయంలో 2019 నుంచి 2024 వరకు జరిగిన కాకినాడ కార్పొరేషన్ నిధుల దుర్వినియోగంపై శాఖాలవారీగా విచారణ జరిపించాలని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివేదిక సిద్ధం చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబును సోమవారం విజయవాడలో కలిసి కొండబాబు నివేదిక అందజేయనున్నారు. ఏయే పనుల్లో నిధుల దుర్వినియోగం జరిగిందనే విషయాలు ఆ నివేదికలో పొందుపరిచారు. ఈ విషయాలన్నింటిపై సమగ్ర విచారణ జరిపించి కార్పొరేషన్ నిధులను, ఆక్రమణకు గురైన సామాజిక స్థలాలను కాపాడి, ఆక్రమణలకు, సహకరించిన వారిపై సమగ్ర విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని కోరనున్నారు.

మరిడమ్మ దేవస్థానం వద్ద అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 18: స్థానిక మరిడమ్మ దేవస్థానం వద్ద ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. అన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జాతర విజయవంతం కావడం పట్ల ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అరీఫ్ ఆలీ,దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మజీ పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనలో రోటరీ కృషి అభినందనీయం



రోటరీ భవన్‌కు రూ.50 వేలు చెక్కు అందజేస్తున్న వేణునాథరావు

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 18: పోలియో నిర్మూలనలో రోటరీ కాకినాడ సెంట్రల్ కృషి అభి నందనీయమని డాక్టర్ కాళ్లకూరి శైలజ అన్నారు. ఆదివారం స్థానిక సూర్య కళామందిరంలో రోటరీ కాకినాడ సెంట్రల్ ఆధ్వర్యంలో విముక్తి పేరుతో చిన్నారుల భవిష్యత్తు- సమాజ బాధ్యత అంశం పై ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ముఖ్యవక్తగా డబ్ల్యూహెచ్‌వో వైద్యాధికారి డాక్టర్ జాన్ జుడే జాషువా మాట్లాడుతూ ప్రపంచం వ్యాప్తంగా 99 శాతానికి పైగా పోలియోను పూర్తిగా నిర్మూలించారని చెప్పారు. క్లబ్ సభ్యుడు యడ్లపల్లి వేణునాథరావు రోటరీ సెంట్రల్ ట్రస్ట్ భవాన నిర్మాణానికి రూ.50 వేలు చెక్కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బంగారు కృష్ణమో హన్, జయేష్ దేశాయ్, డాక్టర్ డీవీఆర్ పూషా, డాక్టర్ జి.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్వీఎస్ రావు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'పవన్ స్ఫూర్తితో పేదలను ఆదుకుంటాం'

కొత్తపల్లి, ఆగస్టు 18: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకుంటామని ఉప్పాడకు చెందిన మత్స్యకార నాయకుడు, జనసేన ప్రతినిధి గంటా విజయకుమార్ అన్నారు. ఉప్పాడ శివారు కొత్తపట్నంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మల్లేకాసులు కుటుంబానికి ఆయన ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కష్టాల్లో ఉన్న ప్రజలు, మత్స్యకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సాయం అందిస్తానని తెలిపారు. జనసేన నాయకులు కారే దావీదు, పట్టా శివ, దోనె నారాయణ, నక్కా కామేష్, మల్లే ఎల్లయ్య, దూడ జ్యోతిబాబు, సామ్యేలు పాల్గొన్నారు.

'యువతకు నేతాజీ ఆదర్శం'

ఏలేశ్వరం, ఆగస్టు 18: స్వాతంత్ర్య ఉద్యమ నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో నేతాజీ వర్థంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన సేవలను కొనియాడారు. పలివెల మల్లేశ్వరరావు, ఆలేటి అనిల్ కుమార్, పోలాబత్తుల పెద్దబ్బాయి, దొంతంశెట్టి చంద్రశేఖర్, సిరిపురపు బాబి పాల్గొన్నారు.

'లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేయాలి'

తాళ్లరేవు, ఆగస్టు 18: లయన్స్‌క్లబ్ సేవలను గ్రామాల్లో నిరుపేదలకు అందించేలా విస్తృతం చేయాలని లయన్స్ గవర్నర్ ఏలూరి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం తాళ్లరేవు సూర్యభాస్కర కల్యాణమండపంలో 2023-24కుగానూ తాళ్లరేవు లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు అందించారు. పేదలకు ఉచిత భోజన కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి ఈశ్వరరావు, చోడే శ్రీనివాస్, మాలతి, గాదిరాజు సతీష్ తదితరులున్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

జగ్గంపేట, ఆగస్టు 18: జగ్గంపేట శెట్టిబలిజ కాలనీ శివారు పంట పొలాల్లో పేకాట శిబిరంపై ఆదివారం జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,200 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. వారిని సోమవారం ఉదయం కోర్టులో హాజరుపరచడం జరుగుతుందన్నారు. పరిధిలో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

తాటిపర్తిలో బీర్ బాటిళ్లు స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 18: గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని కిరాణా షాపులో మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న సాదా వీరబాబును అరెస్టు చేసి 12 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదకరమైనా.... పట్టించుకోరా?

» ఇళ్ల మెట్లు పక్కనే వేలాడుతున్న విద్యుత్ తీగలు » ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు


మెట్లు పక్కనే వేలాడుతున్న తీగలను చూపిస్తున్న స్థానికులు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 18: కిందకు వేలాడుతూ స్లాబు మెట్లుకు తాకుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలు పైకి వేలాడతీయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాకలపూడి శివారు రాజీవ్‌నగర్‌కు చెందిన గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కిందట విద్యుత్తు స్తంభాన్ని ప్రొక్లెయిన్ ఢీకొనడంతో ఓ విద్యుత్తు విద్యుత్తు స్తంభం విరిగిపోవడం, మరో స్తంభం వాలిపోయిందన్నారు. విరిగిన విద్యుత్తు స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసిన విద్యుత్తు శాఖ అధికారులు కిందకి వేలాడుతూ ప్రమాదకరంగా మారిన కరెంటు తీగలను పైకి లేపి కట్టలేదన్నారు. రెండు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడం, విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయన్నారు. మేడమెట్లకు దగ్గరగా కరెంటు తీగలు ఉన్నాయని, పిల్లలు, పెద్దలు మేడపైకి వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తూ ఎక్కడ కరెంటు తీగలు చేతికి తగిలి ప్రాణాపాయం సంభవిస్తుందోనన్న ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో పలుసార్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, విద్యుత్తు తీగలను పైకి మార్పించేలా ఎమ్మెల్యే పంతం నానాజీ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కోరింగ రోప్‌వే వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ

వంతెనను పరిశీలించిన ఎంపీ

తాళ్లరేవు, ఆగస్టు 18: కోరింగ రోప్‌వే వంతనపై ఉన్న గోతులను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ బాలయోగి ఆదివారం పరిశీలించారు. రానురాను వంతెనకు నిర్వహణ తగ్గిపోవడంతో వంతెన శిథిలావస్థకు చేరుకుంటుంది. మరమ్మతులు చేయిస్తున్నా ఫలితం ఉండడంలేదని, శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు తయారుచేయాలని ఎంపీ ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, కొప్పల బాలరాజు, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి సత్యనారాయణ, జావ్వాది తాతాజీ, చంద్రాల ఆదినారాయణ, చెల్లి అశోక్, నడింపల్లి వినోద్, అత్తిలి బాలకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నేత, తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంటపల్లి చంద్రమౌళి చిత్రపటానికి ఎంపీ గంటి హరీష్‌మాధుర్ బాలయోగి ఆదివారం పూలమాలలతో ఘన నివాళులర్పించారు. చంద్రమౌళి మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ఓదార్చారు. చంద్రమౌళి కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని ఎంపీ భరోసా ఇచ్చారు.

ఆకట్టుకున్న భైరవపుష్పం నాటిక


కళాపురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

పోర్టుసిటీ (కాకినాడ), ఆగస్టు 18: ఎస్వీ రంగారావు కళాస్రవంతి 10వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రదర్శించిన భైరవపుష్పం నాటిక ఆకట్టుకుంది. మూఢ నమ్మకాలను పారద్రోలాలనే ప్రధాన ఇతివృత్తంతో సోషియో ఫాంటసీ కథాంశంతో ప్రదర్శన కొనసాగింది. ఆదివారం రాత్రి స్థానిక వెంకటరత్నపురంలోని దంటు కళాక్షేత్రంలో వార్షికోత్సవ వేడుకలను కాకినాడ రూరల్ మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు జ్యోతిప్రజల్వన చేసి ప్రారంభించారు. నాటికకు పేర్నీడి వెంకన్నబాబు రచన, దర్శకత్వం బాధ్యతలు చేపట్టగా, దర్శకత్వ పర్యవేక్షణ నాట్యాచార్య ఎంవీ రమణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత నాట్యాచార్య ఓఎంవీ రమణ శిష్యబృందం ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఎస్వీ రంగారావు కళాపురస్కారాలను తురగా సూర్యారావు, పొన్నంపల్లి శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, సీతారామరాజు కళావేదిక అధ్యక్షుడు కర్రి అచ్యుతరామిరెడ్డి, యంగ్మెన్స్ హేపీ క్లబ్ కార్యదర్శి నాదెళ్ల ప్రభుదాస్, నిర్వాహకులు డేగల వెంకట్‌ప్రముఖులు ఉన్నారు.

'శ్రీచైతన్య'లో రాజ తిలక వేడుకలు


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, ఆగస్టు 18: కాకినాడ రూరల్ సర్పవరం శ్రీచైతన్య పాఠశాల్లో కాకినాడ జోన్ రీజినల్ ఇన్‌చార్జి గోపీనాథ్ ఆధ్వర్యంలో రాజ తిలక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులకు బ్యాడ్జీలను సర్పవరం ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్, స్కూల్ ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ సురేష్ అందజేసి అభినందించారు. నాణ్యమైన విద్యక్రీడలతో పాటూ నాయకత్వ లక్షణాల పెంపొందించేందుకు శ్రీ చైతన్య స్కూల్ చేస్తున్న కృషిని ఎస్ఐ అభినందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కోసం ఏటా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఏజీఎం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ నాగేశ్వరరావు, సీ బ్యాచ్ ఇన్‌చార్జి రాయుడు, ఎస్ బ్యాచ్ ఇన్‌చార్జి కృష్ణ, ఏవో సురేంద్ర, పీఈటీ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యపై వినతి

సర్పవరం జంక్షన్, ఆగస్టు 18: కాకినాడ నగరపాలక సంస్థలో విలీన గ్రామాల ప్రతిపాదన సమస్యను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని మాజీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం విలీన గ్రామాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాజీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గొడారిగుంటలో ఎమ్మెల్యే పంతం నానాజీని కలుసుకుని వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని నానాజీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెద్దాడ సుబ్బారాయుడు, పితాని అప్పన్న, గుత్తుల రామలింగేశ్వరరావు, పలివెల వీరబాబు, రాయుడు అనిల్, మాతా లక్ష్మణ్, మేడిశెట్టి వెంకటరమణ, గవర శ్రీరాములు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైసీపీ

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లీలామాధవరావు



మాట్లాడుతున్న లీలామాధవరావు, కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేక దృశ్యం

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 18: గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రేషన్ డీలర్ల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు పేర్కొన్నారు. కాకినాడ అన్నదాన సమాజ మందిరంలో ఆదివారం కాకినాడ జిల్లా రేషన్ డీలర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లకు సమాంతరంగా ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టి డీలర్ల వ్యవస్థను గత ప్రభుత్వం నాశనంచేసిందని ధ్వజమెత్తారు. పైగా పంచదార, కందిపప్పు వంటి నిత్యవసర సరుకులు పంపిణీ చేయకుండా మోసం చేసిందన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో డీలర్లు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రేషన్ డీలర్లకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఎండీయూ వాహనాలను రద్దు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అలాగే డీలర్లకు ఇచ్చే కమిషన్‌లు పెంచాలని కోరామన్నారు. రంజాన్, క్రిస్మస్, సంక్రాంతి కానుకలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ఈ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారన్నారు. 2014-19లలో రేషన్ డీలర్లకు స్వర్ణయుగం వంటిదని అలాంటి రోజులు రాబోతున్నాయన్నారు. అనంతరం కూటమి నేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పల్లయ్య, ప్రతినిధులు వెంకటరమణ, ఫణికుమార్, అన్నపూర్ణ, హేమలత, అప్పలరాజు, కాశిం, బాపూజీ, రాంపండు, కుమార్ పాల్గొన్నారు.

వర్మ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారు

టీడీపీ ఫిర్యాదు


పిఠాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేస్తున్న టీడీపీ నేతలు

పిఠాపురం, ఆగస్టు 18: పత్రికా సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ చేసిన వాఖ్యలను వక్రీకరించిన యూట్యూబ్ చానల్స్, దాని నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పిఠాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు ప్రెస్‌మీట్‌లో పాల్గొనకుండా వాస్తవ విషయాన్ని పక్కన బెట్టి తమ స్వలాభం కోసం వైసీపీకి అనుకూలంగా ఈ విధంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధుల మధ్య, కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు గానూ కొన్ని యూట్యూబ్ ఛానల్స్ విశ్లేషణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్మను కించపరిచే విధంగా వాఖ్యానాలు చేయడంపై మండిపడ్డారు. వర్మ మాట్లాడిన విషయాలను ఎడిట్ చేసి ప్రసారం చేస్తున్నారని, తక్షణం సదరు యూట్యూబ్ చానల్స్ ప్రసారాలు నిలిపివేసి కూటమి ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా కుట్రలు పన్నిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు అనిశెట్టి సత్యానందరెడ్డి, సకుమళ్ల గంగాధర్, పిల్లి చిన్నా, నల్లా శ్రీను, నెక్కల సత్యనారాయణ, కేతవరపు కృష్ణ, షేక్ యాసిన్, భాషా తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలి

ఎమ్మెల్యే నానాజీ


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 18: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. మాజీ కేంద్రమంత్రి చిరంజీవి పుట్టినరోజు పురస్కరించుకుని ఆదివారం ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్, మెగా చిరంజీవి అసోసియేషన్ డాక్టర్ చిట్ల కిరణ్‌కుమార్ ఆధ్వ ర్యంలో శశికాంత్‌నగర్‌లో 100 మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సినీరంగంలో మకుటంలేని మహరాజు చిరంజీవి అని, ప్రజల కష్టసుఖాల్లో ఎన్నుడు వెన్నంటి సాయం అందించే నైజం ఆయనకే సొంతమన్నారు. చిరంజీవి పిలుపుతో బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి లక్షలాది మంది నిరుపేదలకు ప్రాణదానం చేసిన ఘనత చిరంజీవికే దక్కిందన్నారు. పెద్ద మొక్కలు కొనుగోలు చేసి, మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేసిన సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి సందడి

కోలాహలంగా రాఖీ దుకాణాలు


ఏలేశ్వరంలో రాఖీలు కొంటున్న మహిళలు

ఏలేశ్వరం, ఆగస్టు 18: సోదరి సోదరుల అనురాగానికి ప్రతీకగా శ్రావణ పౌర్ణమి రోజున నిర్వహించే రాఖీ పండగకు సోదర, సోదరిమణులందరూ సిద్ధమయ్యారు. సోదరుడికి దీర్ఘాయుస్సు, తన అభివృద్ధిని కోరుకుంటూ సోదరి రాఖీని చేతికి కట్టడం ఆనవాయితీగా వస్తుంది. రాఖీ కట్టించుకున్న సోదరులు ఆడపడుచులకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, గాజులు, పలురాల బహుమతులు అందజేస్తారు. ఈ పండుగ సందర్భంగా మండలంలో రాఖీల విక్రయాల దుకాణాలు కళకళలాడుతున్నాయి. మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.200 వరకు విలువ చేసే రాఖీలతో పాటు వెండి రాఖీలను విక్రయిస్తున్నారు. ఏలేశ్వరంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాఖీ మహోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జి సుధక్ నేతృత్వంలో లింగంపర్తి రోడ్డులో నిర్వహించిన రాఖీ మహోత్సవానికి జిల్లా ఇన్‌చార్జి బి.కె.మీరక్ ముఖ్య అతిథిగా విచ్చేసి రాఖీ విశిష్టత, సోదరీ, సోదరీమణుల అనుబంధాన్ని వివరించారు. కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పరవాడ రమేష్, శంకాని బాబ్జి, బోనుమంతి శ్రీను, పాండ్రంకి శ్రీను తదితరులకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు.

ప్రత్తిపాడు: రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం మండలాల్లో రాఖీల అమ్మకాల దుకాణాలు కళకళలాడాయి. అన్నచెల్లెళ్ళ అనురాగానికి, అక్కాతమ్ముల ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రాఖీలను సోదరులకు కట్టేందుకు యువత, మహిళలు పెద్ద ఎత్తున దుకాణాలకు తరలిరావడంతో రాఖీ అమ్మకం దుకాణాలు కోలాహలంగా మారాయి.

కిర్లంపూడి: అక్కా తమ్ముడు, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. రాఖీ వ్యాపారాలు ఊపందుకున్నాయి.


కిర్లంపూడిలో రాఖీ దుకాణం వద్ద మహిళలు

శ్రావణ పూర్ణిమ పూజలు

ప్రత్తిపాడు, ఆగస్టు 18: మండలంలోని రాచపల్లి గ్రామంలో అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రావణ పూర్ణిమ పురస్కరించుకుని పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అపీతకుంచాబ సమేత అరుణాచలేశ్వర స్వామికి అర్చన, పారాయణం, ప్రవచనాలు, అన్న సమారాధనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లలిత సహస్ర నామ పారాయణం, మణిదీప వర్ధన కార్యక్రమాలు చేపడుతున్నట్టు నిర్వాహకులు చెప్పారు.

గాయిత్రిదేవిగా రత్నగిరి వనదుర్గ



అన్నవరం, ఆగస్టు 18: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గమ్మవారి శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం వనదుర్గమ్మ గాయిత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పంచ ముఖాలతో అమ్మవారు అనుగ్రహించారు. ఆలయంలో విశేషపూజలు నిర్వహించగా అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని ద ర్శించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, ఆగస్టు 18: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆదివారం కాకినాడకు చెందిన రాయుడు శ్రీనివాసరావు రూ 1,00,001 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

వెంకన్న ఆలయంలో పవిత్ర సమర్పణ


పవిత్ర సమర్పణ కార్యక్రమంలో వేదపండితులు

పిఠాపురం, ఆగస్టు 18: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్ర సమర్పణ వైభవంగా జరిగింది. ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. పవిత్ర ప్రతిష్ట అనంతరం వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య పవిత్ర సమర్పణ గావించారు. సోమవారం మహాపూర్ణాహుతితో కార్యక్రమాలు ముగియనున్నాయి. టీటీడీ సూపరింటెండెంట్ ఎం.మల్లిఖార్జున, టెంపుల్ ఇనస్పెక్టర్ ఎం.సందీప్, విజిలెన్స్ జమేదార్ ఎం.చినశ్రీనివాసరావు,వేదపండితులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు


భీమేశ్వరస్వామికి విశేష అలంకరణ

సామర్లకోట, ఆగస్టు 18: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో శ్రావణమాసం మహాపర్వదినాలు పురస్కరించుకుని ఆదివారం ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వ ర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తది తరులు భీమేశ్వర స్వామికి విశేష అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అలాగే బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన, విశేష కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులకు ప్రసాదవితరణ చేశారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 500మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్వామి, అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించారు.

'ఆదిత్య'లో ఆన్‌లైన్ సర్టిఫికేషన్

గండేపల్లి, ఆగస్టు 18: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ(అలా), ఐడ్యూ విభూ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ కృత్రిమ మేధస్సు అనే అత్యాధునిక అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. కృత్రిమ మేధస్సు పరిశ్రమ రంగంలో అనుభవం ఉన్న నిపుణులు డాక్టర్ ఆర్.సునీత రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు.

వన్‌టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ

కాకినాడ క్రైం, ఆగస్టు 18: కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో (సీఐ)గా ఎం.నాగదుర్గారావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 2005 ఎస్ఐ బ్యాచ్‌కు చెందినవారు. 2019లో సీఐగా పదోన్నతి పొందారు. గుడివాడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న ఆయన్ని సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ వన్‌టౌన్‌కు బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీఎస్పీ డీఎస్పీగా మోహనరావు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 18: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ డీఎస్పీగా బి.మోహనరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం డీఎస్ఆర్‌పీలో విధులు నిర్వహిస్తున్న మోహనరావును సాధారణ బదిలీల్లో భాగంగా ఏపీఎస్పీకి బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

మోటార్ బైక్ చోరీపై ఫిర్యాదు

పెద్దాపురం, ఆగస్టు 18: స్థానిక బ్యాంక్ కాలనీలో ఆదివారం మోటార్ బైక్ చోరీకి గురైంది. కింగ్ ఒపెరా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఆర్అండ్‌బీ డీఈ ఎం. నాగేశ్వరరావుకు చెందిన ఏపీ 39క్యూజే 3838 నంబరుతో ఉన్న బైక్‌ను పార్కింగ్ ప్రదేశం నుంచి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు.